


# ప్రేమ పిచ్చి

కొకొని కమల

సుజాతకి ఏడుపు వస్తూంది. గోదావరి ఉప్పెనలా గుండెలోంచి దుఃఖం తన్నుకుని వస్తూంది. ఎక్కడైనా ఒంటరిగా కూర్చుని కరువు తీరా ఏడిస్తే కాని హృదయ భారం తగ్గేలా లేదు. ఇంటికి వెళ్ళే వరకూ ఆ కన్నీటిని ఆపటం అసాధ్యం అనిపిస్తూంది.

రోడ్డు క్రాస్ చేసి పరుగు లాంటి నడకతో పార్కులోకి వెళ్ళి, ఒక మూల క్రోటన్ గుబురు పక్కగా కూర్చుండి పోయింది.

పావు గంట ముందు జరిగిన సంఘటన. ఆ మాటలు ఎంత 'వద్దు' అనుకున్నా పదే పదే మనసులో గింగిర్లు తిరుగుతున్నాయి.

ఇన్నాళ్ళూ తన వెంట కుక్కలా తిరిగిన శ్రీకాంత్ ఇప్పుడు తనని ఒక గడ్డి పోచలా తీసి పారెయ్యటం తలుచుకుంటే ఆమె మనసు శరాఘాతం తగిలినట్లు విలవిల్లాడి పోతున్నది. అంతటి ఆ తిరస్కారాన్ని భరించటం సుజాత బేల మనసుకి ఒక పట్టాన శక్యం కావటం లేదు.

'శ్రీకాంత్.'

అతని పేరు ఉన్నంత అందంగా మనసు లేదు. మనుషుల్లో అంతటి మోసం, దగా ఉంటాయని తాను అనుకోలేదు. శ్రీకాంత్ వయువంచకుడని పూర్వమాత్రంగా నయినా తాను తలచి ఉంటే, తెలిసి తెలిసి అతని 'ఉచ్చు' లో పడక పోయేది. కాని... ప్చ్! ఇప్పుడు ఎంత వగచి ఏం లాభం? జీవితం వృథా అయిపోయింది.

శ్రీకాంత్!

తేనె పూసిన కత్తి. మోసానికి మారు రూపం. నమ్మించి ఎంత ద్రోహంచేశాడు? తలపు మాత్రానికే సుజాత మనసు ప్రతీకార జ్వాలలో మండసాగింది. పూపిరి సెగలు బుసలా కొట్టింది. ఆవేశంలో గుండె ఎగిసి పడసాగింది.

తీరని ఆవేదనతో నలిగి పోతూంది సుజాత. అనిర్వచనీయమయిన నిర్వేదం. అశాంతి.

> **మొహంచాటు**
>
> అయిదేళ్లకు ఒక్కసారి
> ఓటు అడగవస్తా
> గెలిస్తే ఓ అయిదేళ్ళపాటు
> మొహంచాటు వేస్తా
>
> - ఎల్లోరా

శ్రీకాంత్!

'ప్రేమ భిక్ష' కోసం నిన్న మొన్నటి దాకా తన వెంట తిరిగిన యాచకుడు.

"సుజా డియర్! నీవు లేకపోతే నాకు జీవితమే లేదు" అన్న ప్రేమికుడు.

"నీ కళ్ళల్లోకి చూస్తూ కాలాని ఇట్టే దొర్లించ వచ్చు. . ." అన్న ప్రేమ పిపాసి.

ఒక్కసారిగా డబ్బు కోసం ఎంతగా దిగజారి పోయాడు?

ప్రేమకి అడ్డురాని కులం, మతం పెళ్ళికి అడ్డు వచ్చాయి. నిజమే. అయినా ఇందులో అతని తప్పు ఏం లేదేమో. తన తొందరపాటేనేమో! కళ్ళకి పొరలు కమ్మి అలాంటి మూర్ఖుడిని, మొరటు వాడిని నమ్మి బతుకును వ్యర్థం చేసుకుందేమో?

ఇన్నాళ్ళూ అతని వ్యామోహంలో పడి వ్యక్తిత్వాన్ని చంపుకుంది. పదుగురిలో వేలెత్తి చూపబడింది. తన దైన పవిత్రతని నాశనం చేసుకుంది. అసలు తన కంటూ ఏమీ మిగుల్చుకోక సర్వం అతనికి ధారపోసింది. కాని, కాని. అందుకు ప్రతిఫలం ఏమిటి? తనకి—ఈ పిచ్చి సుజాతకి చివరికి మిగిలింది ఏమిటి?

అతనన్నీ అణగారిపోయిన తనలో లేనిపోని ఆశలు కల్పి చాడు. కానీ ఇప్పుడు కేవలం డబ్బు కోసం తనని కాదని వేరే అమ్మాయిని పెళ్ళి చేసుకుంటు న్నాడు. ప్రేమ కంటే అతనికి ఆస్తి, అంతస్తులే ముఖ్యం అయ్యాయా?

సుజాత హృదయం భారంగా మూల్గింది.

కన్నీరు అవిరామంగా వర్షిస్తూంది. అలా చాలాసేపు ఉనికిని, పరిసరాల్ని మరిచిపోయి మోకాళ్ళ మధ్య తల దించుకుని విలపిస్తూ కూర్చుండి పోయింది.

పది నిముషాలు . . . పావు గంట!

కాలం గడుస్తూంది.

కాని ఆమె దుఃఖం తరగలేదు.

సన్నగా విలపిస్తున్న ఆమె వెక్కిళ్ళు తప్ప మరే అలజడి లేదు. కావటానికి అది పబ్లిక్ పార్కే అయినా, ఆ సమయంలో సాధారణంగా జనం ఎవరూ ఉండరు.

కానీ...

ఆమెకి ఎదురుగా కొద్ది దూరంలో సిమెంట్ బెంచీ మీద కూర్చుని ఉన్నాడు కుమార్. అరగంట పైగా గమనిస్తున్నాడు ఆమెను. పరిసరాలు కూడా మరిచిపోయి ఆమె అంతగా బాధ పడటం చూస్తుంటే అతనికి చాలా విచిత్రంగా అనిపించ సాగింది.

'పాపం! ఎంత కష్టంలో ఉందో ఏమో?' తనలో తనే జాలి పడ్డాడు. ఆమెని అలా ఒంటరిగా వదిలి పోవాలనిపించలేదు. వాతావరణం బట్టల్లో సన్నగా—లేతగా ఉంది.

కూర్చున్న బెంచి మీద నుంచి లేచాడు కుమార్.

మెల్లిగా సుజాత దగ్గరికి వచ్చాడు.

చివ్వున మోకాళ్ళ మధ్య నుంచి తల ఎత్తింది సుజాత. మొహమంతా ఎర్రగా— చెక్కు తీసిన దుంపగడ్డలా ఉంది. కనురెప్పలు వాచి చురకత్తుల్లా

మెరుస్తున్నాయ్!

కుమార్‌కి చాలా జాలేసింది.

'మీరు ఎందుకో చాలా బాధ పడుతున్న ట్లున్నారు?' అన్నాడు.

అయోమయంగా చూసింది సుజాత.

'నన్ను ఒక ఆత్మీయుడిగా భావించండి. ఇందాక ట్నుంచి మిమ్మల్ని గమనిస్తున్నాను—మీ దుఃఖంలో పాలు పంచుకుని, నాకు చేతనయిన సహాయం చెయ్యటానికి సిద్ధంగా ఉన్నాను' అన్నాడు ఆద రంగా చూస్తూ.

అంతే!

సుజాత మనసు తుళ్ళిపడింది, పర్వదప్పలా. ఆమె కళ్ళు విశాలంగా, విభ్రాంతిగా మారాయి.

ఒకప్పుడు... సరిగ్గా ఇలాగే ఒంటరిగా దిగులుగా కూర్చుని బాధ పడుతున్న సమయంలో సహాయం చేస్తానంటూ తన జీవితంలోకి ప్రవే శించాడు శ్రీకాంత్.

ఆనాటి సంఘటన మెరుపులా సుజాత మెదడులో మెరిసింది.

చురుగ్గా తల విదిల్చి ఆ అపరిచిత యువకుని వైపు చూసింది.

ఆతడు ఎంతో ఆకాంక్షతో రెప్ప వెయ్యకుండా ఆమెకేసి చూస్తున్నాడు.

'నిజం చెబుతున్నాను. మేడమ్! నాకు చేత నయిన సహాయం...'

అతని వాక్యం పూర్తి కానేలేదు.

'రాస్కెల్స్..' పళ్ళు పటా పటా కొరికింది సుజాత.

'నాకు సహాయం చేస్తావురా?' అంటూ దూకుడుగా ముందుకి వంగి అతని గుండె మీద షర్టుని రెండు చేతుల మధ్య ఒడుపుగా బిగించింది. వాడిగా ముఖంలోకి చూస్తూ అడిగింది:

'ఇప్పుడు చెప్పు నాకు సహాయం చేస్తావురా?'

విసురుగా విదుల్చుకున్నాడు కుమార్.

'మర్యాదగా ముందు షర్టు వదలండి. సహాయ పడటంలో తప్పేముంది? సాటి మనిషిగా— ఒక మిత్రుడిగా.'

అతని మాట పూర్తి కాకుండానే చొక్కాని ఒక్క గుంజు గుంజి విసురుగా వెనక్కి నెట్టింది.

'హుఁ... సహాయం చేస్తావురా మిత్రుడిగా! మీ మగవాళ్ళు సహాయం పేరుతో జీవితాన్ని కబళించి వేస్తారు. నమ్మించి గోతుల్లో దించేస్తారు. బ్రతుకుని నిలువునా మట్టగించేస్తారు. సహాయం చేస్తావురా? ఈ మాట నాతో అంతా అన్నావుగాని, ఇంకే అమ్మాయితోటి అనకు. జాగ్రత్త!' ఆవే శంతో రొప్పుతూంది సుజాత.

ఆమెలోని ఈ హఠాత్ పరిణామానికి విస్తు పోయాడు కుమార్.

అతడు ఆ విభ్రాంతి నుండి తేరుకునే సరికి సుజాత మెరుపులా పార్కు దాటి రోడ్డు మీదికి వచ్చేసింది.

ఆదిరే గుండెని అదుపులోకి తెచ్చుకొంటూ, తేలిగ్గా వూపిరి పీల్చుకున్నాడు కుమార్.

'పాపం, ఎవరో పిచ్చిది! ప్రేమలో మోసపోయి ఉంటుంది' అనుకుని నిట్టూర్చాడు. ★

# ఆంధ్రప్రభ

## సచిత్ర వారపత్రిక

### ఉగాది నవలల పోటీ

రౌద్రి ఉగాది సందర్భంగా ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక నవలల పోటీ నిర్వహిస్తున్నది. నవలల ఎన్నికలో ఎప్పుడూ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికదే అగ్రతాంబూలం అని పాఠకులకు తెలుసు. మంచి నవలలను మాత్రమే ఎన్నిక చేసి, ఉత్తమ రచయితలను, రచయిత్రులను ప్రోత్సహించడం మా సంప్రదాయం. ఈసారి కూడా ప్రముఖ రచయితలు, రచయిత్రులు, కొత్తవారు ఇతోధికంగా పోటీలో పాల్గొనగలరని ఆశిస్తున్నాం.

**మొదటి బహుమతి రు. 5,000**
**రెండవ బహుమతి రు. 3,000**
**మూడవ బహుమతి రు. 2,000**

నిబంధనలు :

★ నవల అర ఠావు సైజు కాగితాలలో 250 పుటలు ఉండాలి.
★ సిరాతో కాగితానికి ఒక ప్రక్కనే రాయాలి.
★ నవలా వస్తువు తెలుగువారి జీవితానికి సంబంధించినదై ఉండాలి.
★ అనువాదాలు, అనుసరణలు పోటీకి పనికిరావు.
★ కవరు పైన 'ఉగాది నవలల పోటీ'కి అని స్పష్టంగా రాయాలి.
★ బహుమతి పొందని నవలలో యోగ్యమైనవి వారపత్రికలో మామూలుగా ప్రచురించుకునే హక్కు మాకు ఉన్నది.
★ ప్రచురణకు స్వీకరించని నవలలు తిప్పిపంపే నిమిత్తం తగినంత పోస్టేజి అంటించిన, అడ్రసు ఉన్న కవరు నవలతో జత పరచవలసి ఉంది. లేకపోతే తిప్పి పంపడం సాధ్యం కాదు.
★ ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకు అవకాశం లేదు.
★ కలం పేరు ఉపయోగించే వారు అసలు పేరు, పూర్తి చిరునామా హామీ పత్రంతో ఇవ్వాలి.
★ నవలలు "ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక, దోమల్‌గూడ, హైదరాబాదు—500029" అడ్రసుకు పంపవలసి ఉంది.

నవలలు మాకు చేరవలసిన ఆఖరు తేదీ :

**31 డిసెంబరు, 1979**